అతిథిగా
ఆ భవంతిలోనికి
అడుగుపెట్టిన
అతనికి
తెలిసిన రహస్యం?

# భవంతి రహస్యం




ఈదురుగాలి వీస్తోంది...

రివ్వుమని పోతూన్న రైలు ఆగిపోయింది క్రమంగా!

తుఫాను సమయంలో పక్షులు ఆందోళనగా గూళ్లలోంచి తలలు బయటకు పెట్టినట్లుగా జనం కంపార్ట్‌మెంట్లలోనుండి వెలుపలికి చూడసాగారు...!

అదొక నిర్జన ప్రదేశం! సుదూరంలో కొండలు, గుట్టలు ఉన్నాయి. చాలామంది క్రిందికి దిగారు లోపల వుండలేక. ఎండలేకపోవడంతో పిల్లలు, స్త్రీలుకూడా కొద్దిదూరం నడిచి పొదలదగ్గరా, నల్లరాళ్లపైనా కూర్చుని విశ్రాంతి పొందుతున్నారు.

అనంత్ ఒంటరిగా ప్రయాణిస్తున్నాడు.

చేతిలో పేపరు విసుగ్గా కింద పడేసి టైము చూసుకున్నాడు...

సాయంత్రం ఐదవుతూంది. బయటకు వచ్చాడు. ఇంజనువద్దకు నడిచాడు. ఏదో టెక్నికల్ లోపం వల్ల రైలాగిపోయింది. గార్డులు, హెల్పర్లు వాళ్లపనిలో వాళ్లున్నారు! టిటిఇని అడిగితే మూడు గంటలు తర్వాతగానీ రైలు కదలదని చెప్పాడు! ఉస్సురని వెనుదిరిగాడు.

ప్రయాణికులు నిశ్శబ్దతను భంగపరుస్తున్నారక్కడ. అనంత్ ఒంటరితనం కోసం దూరంగా నడిచాడు. ఇంతలో ఒకవైపు దూరంగా ఎత్తయిన చెట్లు గుంపుగా పరుచుకుని కనిపించాయి...! వాటి వెనుక మబ్బుల వెనుక విశాలమైన కొండలు మసగ్గా కనబడుతున్నాయి. ఆ ప్రాంతం గంభీరంగా వుంది!

ప్రశాంతమైన పచ్చని చెట్లూ, పరిసరాలు అనంత్‌లాంటి జిజ్ఞాసపరుడిని ఆకర్షించడంలో





ఆశ్చర్యం లేదు. కొద్ది దూరంలో ఒక ప్రాంతం అతడి దృష్టినాకర్షించింది. సిమెంట్‌తో నిర్మించిన పొడవాటి ఎత్తయిన తల్పం లాంటిదది! విశాలమైన చెట్టు ఒకటి దానిని ఆనుకుని వుంది. అందువల్ల అక్కడ నీడగా చల్లగా వుంది. పరీక్షగా చూస్తే ఆ సిమెంట్ కట్టడం ఒక సమాధి అని తెలుస్తోంది!! దానిమీద ఏవో అక్షరాలుకూడా వున్నాయి...

అతడి వెన్ను వణికింది! అంత నిర్మానుష్య ప్రదేశంలో సమాధిని చూసి.. దానిచుట్టూ ఎండిన ముళ్లచెట్లు గాలికి ఊగుతున్నాయి. సమాధి ఉపరితలం నునుపుగా వుండి పడుకోవడానికి చాలా అనుకూలంగా వుంది. అక్కడి చల్లని నీడ అతడి భయాన్ని జయించింది!

మనసులో సందేహాన్ని వదిలించుకుని అనంత్ దానిపై దుమ్ము దులిపి మెల్లగా కూర్చున్నాడు... చెట్లమధ్య దూరంగా చూసి విస్తుపోయేడు!

పాడుబడిన పెద్ద భవంతి కనిపించింది! అక్కడెవరూ నివసించడంలేదని మాత్రం సులభంగా తెలుస్తోంది! భవంతికీ, సమాధికీ సంబంధం ఏదైనా వుందా అన్న ఆలోచన మాత్రం అతడిలో ఆందోళన పుట్టించింది!

ఒక్క క్షణం అనంత్‌కు అక్కడినుండి వెళ్లిపోదామనిపించింది! అతడు పెద్ద ధైర్యస్తుడు కాకపోయినా పిరికివాడు మాత్రం కాదు! అర్థరహితమైన భయంవల్ల మంచి చల్లని ప్రదేశం వదులుకుంటున్నానేమోనన్న భావం కలగగానే మళ్లీ ఆగిపోయేడు!!

మనసులో భయం ఎక్కువ స్థాయిలో ఉన్నప్పుడు, అన్నిటికీ తెగించి ఎదురుగా వున్న సమస్యతో పోరాడాలా? లేదా నిస్సహాయంగా అక్కడినుండి పారిపోవాలా? అనేది సులభంగా నిర్ణయించుకోవచ్చు.

కానీ భయం సాధారణ స్థాయిలో వున్నప్పుడు ఏ నిర్ణయం తీసుకోలేని స్థితిలో వుండకతప్పదు. పరిస్థితులు, పరిసరాలు పూర్తిగా అర్థంకానీ, అనుభవంకానీ ఇటువంటి సమయాల్లో ముందేం జరుగబోతోందో ఏమీ చెప్పలేం.

నడుం వాల్చాడు. అతడి లగేజీ రైల్లోనే వుంది. హఠాత్తుగా వచ్చిన పవనానికి పైన వృక్షం తన విశాలమైన కొమ్మలు ఊపుతూ కొద్ది క్షణాలపాటు గణాచారిలా నర్తించింది!

పైకే కళ్లుపెట్టి చూస్తున్న అనంత్‌కు అది చూసి వెన్నులో చలిపుట్టింది!! కళ్లు మూసుకుని నిద్రకుపక్రమించాడు. అతడి స్మృతిపథంలో భవంతే మెదులుతూంది. అది అక్కడ ఎందుకుంది!? ఎవరు కట్టించారు దాన్ని?! సమాధికి, దానికీ ఏదైనా సంబంధం వుందా?? అన్న ఆలోచనలకు సంతృప్తికరమైన సమాధానం దొరకడంలేదు. తలక్రింద దిండు లేకపోవడంవల్ల నిద్ర మగతగా పట్టిందతడికి!

● ● ●

ముళ్లచెట్లు గాలికి ఊగుతూ కాలికి గీరుకోవడంవల్ల అనంత్‌కి మెలకువ వచ్చేసింది... అన్యమనస్కంగా వుంది! టైము చూసుకున్నాడు పైకి లేచి. ఆరవుతోంది. చలికాలం కావడంవల్ల వెలుతురు అంతగా లేదు.

భవంతి మళ్లీ కళ్ళబడింది. ఆసక్తి పెరిగింది. అతడు నిద్రపోయింది వలభై నిమిషాలు... రైలుకదలడానికి ఇంకా సమయం వుంది... ముళ్లచెట్లూ, తుప్పలు దాటుకుంటూ భవంతిని సమీపించాడు!!

చాలా విశాలమైన కట్టడం అది. చూడ్డానికి జీవంలేని శరీరంలా నిశ్శబ్దంగా వుంది. చుట్టూ మొక్కలు మొలిచాయి. రకరకాల పొదులు ప్రతిచోటా అల్లుకుపోయి వున్నాయి. గోడలు బీటలువారి శిథిలావస్థను తెలియజేస్తున్నాయి.

అటువంటి నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న ఆ శిథిల భవంతిని తిలకించడం అనంత్‌కు చాలా

ఆనందాన్నిచ్చే సంఘటన!

ఒంటరితనాన్ని ఆస్వాదించడం - పురాతన కట్టడాల్ని సందర్శించడం అతడి ఇష్టాలు!!

చీకటి ముదరడంతో భవంతి సరిగా కనిపించడంలేదు.

చీకటిలో అది - ఏదో రహస్యాన్ని తనలో దాచుకున్న ముదుసలిలా నిఘాఢంగా చూస్తోంది.

అనంత్ ఇక వెళ్లిపోవడానికి వెనక్కి కదలబోయాడు!

పదడుగుల దూరంలో చప్పుడయింది!! ఆగిపోయాడు! ఉత్సుకతను ఆపుకోలేక శబ్దం వస్తున్నవైపు చూసేడు.

ఎవరో నడుస్తున్నట్టు వుంది! భవంతినానుకుని పెద్ద చెట్టు మొల్చింది. భవంతి లోపలికి పోవడానికి అక్కడ సన్నని మార్గం అస్పష్టంగా కనబడుతూంది. నిజానికది ముఖద్వారం కాదు. అక్కడ చప్పుడుతోపాటు వెలుతురు క్రమంగా పెరగడం అతడు గమనించాడు. అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేశాడు!!

ఈదురుగాలి పెరిగింది. ఎండుటాకులు గలగలమంటూ లేచాయి. అతడికెందుకో భయం వేసింది.

ఒక ఆకారం లాంతరు పట్టుకుని గుమ్మంవద్ద ప్రత్యక్షమైంది. అతడు విభ్రాంతిగా చూశాడు.

''ఎవరది అక్కడ?'' ఆకారం ప్రశ్నించింది మగగొంతుతో!

...

''దారి తప్పారా!?''

ఉలిక్కిపడి తేరుకున్నాడు. ''లే... లేదు!'' జవాబిచ్చాడు. అక్కడ మనుషులు నివసించడం చూస్తుంటే ఆశ్చర్యంతో తలమునకలవుతున్నాడు. గాలికి దుమ్ము ఎగిరి కళ్లల్లో పడుతోంది.

''లోపలకు రండి బయట పాములవీ వుంటుంటాయి''

అనంత్ చెట్టుక్రిందగా నడుస్తూ వెలుతురు వద్దకు వెళ్లాడు. హోరుగాలి అతడిని

## ఆరాధన



''ఏమండీ.. ఆ ఎదురింటతను నా వైపే తదేకంగా చూస్తుంటాడు. ఎందుకని?'' అడిగింది భార్య.

''అతనొక ప్రకృతి ఆరాధకుడు. ఈ చుట్టుపక్కల పర్వతాలేవీ కన్పించక బహుశా నిన్ను చూస్తున్నాడేమో.'' చెప్పాడు భర్త.

-అండె అనిత (చిత్తూరు)

విసిరికొట్టింది. నిభాయించుకొని నిల్చున్నాడు. అంతవరకూ లేనిది అక్కడంత గాలి ఎందుకు వీస్తుందో అతడికర్థంకావడంలేదు!!?

వెలుతురులో ఒక ముసలివ్యక్తి ఉన్నాడక్కడ! పొడవాటి గడ్డం, మీసాలు గాలికి తేలిగ్గా ఎగురుతున్నాయి. సంరక్షణ లేకుండా ఎదిగిన జుత్తూ, ముతక దుస్తులతో అతడు ఇల్లులాగే శిథిలమైపోయి వున్నాడు. చేతిలో తాతలకాలం నాటి పాత లాంతరు వెలుతురునివ్వడానికి గట్టిగా ప్రయత్నిస్తోంది.

అనంత్ అతడినే విచిత్రంగా చూస్తూ తన గురించి చెప్పాడు!?

అది విని ''సరే! ఈ చెట్లు దాటేవరకూ నేను తోడు వస్తాను. పదండి!'' అంటూ లాంతరుతో కదిలాడు. అనంత్‌కి దాంతో దిగులుపోయింది.

అకస్మాత్తుగా చెట్లుపైన పెద్దగా ఉరిమింది. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు! కారు మేఘంలా ఉన్న ఆకాశంలో అగ్నిబాణం దూసుకుపోయినట్టు మెరుపు మెరిసింది! మళ్లీ ఉరుము! అనంత్‌కి తల దిమ్మెత్తిపోయింది!

హోరుగాలిలోంచి చినుకులు సూదుల్లా ఇద్దరిపైనా దాడిచేశాయి! క్రమంగా, వర్షం పడుతున్న చప్పుడు ప్రారంభమయింది. ఆకస్మిక వర్షాన్ని విస్మయంగా చూడసాగాడతడు!?!

''కాసేపాగి వెళ్లొచ్చు....'' అన్నాడు ముసలాయన, తడవకుండా లోపలికి నడుస్తూ. ఉస్సురని కదిలాడు అనంత్ ఆయనతోపాటు... కిటికీలన్నీ మూసి వుండడంతో లోపల వెచ్చగా వుంది. ''కరెంట్ లేదా?'' అడిగాడు.

''లేదు బాబూ నూనె దీపాలే మాకు దిక్కు!''

''ఇంత నిర్జన ప్రదేశంలో - ఎలా వుంటున్నారు! ఇంటికి కావలసిన వస్తువులూ, అవీ ఎలా వస్తున్నాయి?'' అడిగేడు.

''నగరం ఇక్కడికి పది కిలోమీటర్ల దూరంలో వుంది. అప్పుడప్పుడు కాలినడకనే వెళ్లి ఇంటికి కావలసిన సామాను తెస్తూ వుంటుంటాను! పూర్వీకులిచ్చిన ఇల్లు... ఆనాటి వైభవాలు, ఆస్తులు పోయి ఈ ఇల్లుమాత్రం మిగిలింది! దీన్ని వదలలేక ఇక్కడే వుంటున్నాం!'' ముసలాయన దగ్గుతూ చెప్పేడు.

ఇంట్లో ఇంకా ఎవరో వున్నారని అర్థమయింది!?

బయట పెద్ద శబ్దం వినవస్తోంది, వర్షం పడుతూన్నట్టు... గాలి వెల్లువలా లోపలికి దూసుకొస్తోంది. అక్కడ కూర్చోడానికి కుర్చీకూడా లేదు! చూస్తుంటే అది దుమ్మూ ధూళితో మనుషులెవరూ నివసించని గృహంలా వుంది!! అతడి ఇబ్బంది గమనించి ముసలాయన బాబూ ఇలా మెట్లెక్కి వెళితే పైగదిలో మా అమ్మాయి ఉంది! వర్షం తగ్గేదాకా కాలక్షేపంగా మాట్లాడుకోవచ్చు. వెళ్లండి!!'' అన్నాడు.

అనంత్ కదిలాడు! ముసలాయన దగ్గుతూ కుక్కిమంచంపై కూలబడ్డాడు. అంతా చీకటి... అక్కడక్కడ నూనెదీపాలు మసకగా వెలుగుతున్నాయి. లంకంత కొంప. చాలా గదులు నిరుపయోగంగా తలుపులు మూసేసి ఉన్నాయి. అలికిడికి గబ్బిలాలు రెక్కలు కొట్టుకుంటూ చీకట్లో అతడిని రాసుకుంటూ పోతున్నాయి!

చెక్కమెట్లు కనిపించాయి. చీకట్లో ఒకచోట కిటికీ తలుపులు తెర్చి వుండడంతో మంచులాంటి చల్లని గాలి వచ్చింది. నిలువెల్లా వణికిపోయేడు అనంత్!! ఎక్కడో పెద్దశబ్దంతో పిడుగుపడి భవంతి అదిరింది!!

అక్కడికి వచ్చినందుకు నిజంగా తనను తాను నిందించుకున్నాడతడు!

● ● ●

విశాలమైన గది చేరుకున్నాడు. పెద్ద దీపం జ్యోతిలా వెలుగుతూంది ఒకచోట..! ముసలాయన కూతురు గది అదేనని తెలుస్తోంది! పెద్ద మంచంపై ఎవరో ముసుగులో పడుకుని వున్నారు?! వెనుక గాజు తలుపులు గల కిటికీలు ఉన్నాయి.

అతడి అడుగుల చప్పుడుకి ముసుగు కదిలింది...!!!

''ఎవరూ?'' అంది తలపై దుప్పటి తొలగించి ఒకమ్మాయి! అద్భుత సౌందర్యవతి ఆమె!! మంచి యౌవనంలో వుంది. అప్రయత్నంగానే అనంత్ సంకోచంలో పడ్డాడు.

ఆమె అతడి ఇబ్బందిని గ్రహించి తనే చనువు తీసుకుని కూర్చోమని చెప్పింది. నగిషీలు చెక్కిన చెక్క కుర్చీలో కూర్చున్నాడు. తన గురించి చెప్పాడు.

అది విని ''అనవసరంగా వర్షంలో చిక్కుకుపోయారే!'' అంది మాటలు కలుపుతున్నట్టు.

'ఆ! ఇంకా చాలా టైముంది రైలు కదలడానికి. ఈ లోగా వర్షం తగ్గవచ్చు!''-వాచీ పరిశీలిస్తూ చెప్పాడు.

బయట వర్షం, లోపల వెచ్చని గది... ఎదురుగా అందమైన యువతి! అనంత్ మెల్లగా ఆమెతో మాటల్లో పడ్డాడు. ఆమె మాటలు వింటుంటే ఎంతో ఆశ్చర్యం వేస్తూంది. ఎంతో పరిజ్ఞానం వుంది ఆమెలో. ఏ విషయం మీదనైనా ఆమె గొప్ప అవగాహనతో మాట్లాడగలుగుతుంది. అందం, తెలివి, సమయస్ఫూర్తి ఆమెలో పోటీపడుతున్నాయి.


అనంత్ అవివాహితుడు. నగరంలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు.

''మీరేం చదివారు?'' అడిగాడు ఆమెను.

ఎం.ఎ. సైకాలజీ!'' అందామె.

అవాక్కయ్యాడు!! ఆమె బాగా

## పుస్తకప్రియుడు



రామానంద్‌చటర్జీ విఖ్యాత జర్నలిస్టు. ఆయన పుస్తకప్రియుడు. పుస్తకాలకోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనకాడేవాడు కాదు. తనదగ్గర డబ్బులేని సమయంలో ఆయన తనకు నచ్చిన పుస్తకం కనిపించినప్పుడు దాన్ని మొదటి నుంచి చివరి వరకూ నోట్‌బుక్‌లో రాసుకొనేవాడు. ఒక్కొక్కసారి తన భార్య మనోరమాదేవి చదవడం కొరకు రామానంద్ కొన్ని పుస్తకాలను నోట్‌బుక్‌లోకి ఎక్కించేవాడు.

-కొడిమెల శ్రీరామమూర్తి(ఏలూరు)

నచ్చిందతడికి. ధైర్యంచేసి అడిగేడు ''మీకు పెళ్లయిందా?''

ఆమె అతనివైపు అదోలా చూసి లేదని చెప్పింది!

అతడి హృదయం పరవశించింది. ఆమెను పెళ్లిచేసుకుంటే బావుంటుంది అన్న ఆలోచన బలపడింది! చనువుతో కూడిన ఆమె ప్రవర్తన, మాటలు పూర్తి ధైర్యాన్నిచ్చేయి. అతడు తన మనసులోమాట మెల్లగా బయటపెటడ్డాడు!

హుషారుగా ఏదోమాట్లాడబోయిన ఆమె, అది విని నిశ్శబ్దంగా కళ్లెత్తింది.

హఠాత్తుగా విసిరిన గాలి విసురుకి దీపం గుప్పున ఆరిపోయింది! అంతా చీకటి! కిటికీ రెక్కలు దబదబా కొట్టుకుంటున్న చప్పుడు మాత్రమే వినిపిస్తోంది.... హోరుమని దూసుకొస్తున్న వాయుశబ్దం ఎంతటి ధైర్యస్తుడినయినా భయపెట్టేలా వుంది.

ఆమె భయపడుతుందేమోనని పిలిచాడు. హఠాత్తుగా ఒక చెయ్యి అతడి చేతిని పట్టుకుంది. అది గరుకుగా ఏదో జంతువు చేయిలా వుంది! గుర్రుమన్న ధ్వనికూడా వినిపిస్తోంది!!

అనంత్ తత్తరపడి జేబులోంచి లైటర్ తీసి చటుక్కున వెలిగించాడు. దుప్పటి ముసుగులో కనిపించిందామె! అతడి చేతిపైకూడా దుప్పటి కప్పి వుంది! అతడికి అర్థంకాక చెయ్యి లాక్కుని లైటర్‌తో ఆరిపోయిన దీపం వెలిగించాడు. కాంతి మళ్లీ గదిలో పరచుకుంది నిండుగా...

''ఏమండీ?'' అని అర్చాడు!

దుప్పటి క్రిందికి జారింది... బయట ఫెళ్లుఫెళ్లుమని ఉరుముతుంది. ముఖంపై శిరోజాలు వ్రేళ్లాడుతుండగా ఆమె అడివి మృగంలా క్రూరంగా అరుస్తూ అతడిపైకి లేచింది!! ఆమె ముఖం నల్లగా కాలిపోయినట్టు, గుండ్రటి బొబ్బలతో కమిలిపోయి వికారంగా వుంది.

అతడు గుండెలవిసిపోయేలా అర్చాడు! ఆమె అరుస్తూ నోరు తెర్చింది. నోటి చివర పెద్ద పెద్ద కోరలు పదునుగా, భయానకంగా కన్పిస్తున్నాయి! ఆమె చటుక్కున పొడవాటి గోళ్లతో ఉన్న నల్లటి మొరటు చేతులు అతడి మెడపైకి చాచింది.

అనంత్ చావుమూడిందని నిశ్చయించుకుని వెనక్కు దొర్లాడు. పైకి లేచి మెట్లవైపు ఉరికాడు. రెండు మూడు బారలు పొడవున్న ఆమె శిరోజాలు అన్ని వైపులకూ లేచి సర్పాల్లా ఆడుతున్నాయి. ఆమె గుండెలదిరేలా అరుస్తూ అతని వెంట పడింది!!

ఒడలంతా ఒణికిపోతుండగా రక్షించమని కేకలు పెడుతూ క్రిందికి పరుగులు తీశాడతడు. వెనక దబదబా అడుగులు విన్పిస్తున్నాయి...'' అతడి మెదడు దిమ్మెత్తిపోయింది. కాళ్లు నడుస్తున్నట్టుగాక గాలిలో తేలుతున్నట్టున్నాయి. ప్రాణభయంతో ఆ చీకట్లో ఎటుపోతున్నాడో అతడికే తెలియడంలేదు??!

● ● ●

ఒక గదిలో ఆగేడు. అక్కడ పెద్దదీపం వెలుగుతూంది. వెనుక తరుముతున్న చప్పుడు ఇప్పుడు లేదు. ఆ రూపం తల్చుకుంటేనే శరీరం గగుర్పొడుస్తూంది! వెలుతురు ఉండడంతో ధైర్యం వచ్చింది. అకస్మాత్తుగా ఓ ఆకృతి మసకగా కనిపించింది?! ఉలిక్కిపడ్డాడు భయంతో!! ''మీరెవరు?'' ఆమె ప్రశ్నించింది! నడివయసులో వుందామె!! వర్షపుజల్లు కిటికీలోనుండి వాళ్లపైబడుతుంది. అతడికంతా

అయోమయంగా గందరగోళంగా వుంది!!

చలికి వణికిపోతూ తన అనుభవాలు వివరించాడు. ఆమె అది విని చటుక్కున నవ్వింది! ఆమె వంటిపై నగలు, అర్ధరాత్రి ఎడ్లబండ్లు వెళుతున్నప్పుడు ఎద్దుల మెడలో మువ్వలలా శబ్దం చేశాయి...

వర్షపురాత్రి, నిశీధిభవంతిలో పెళ్లికో పేరంటానికో వెళ్తున్నట్లు ఆమె అన్ని నగలతో ఎందుకు ముస్తాబయిందో అర్ధంకావడంలేదు!?

''ఆ అమ్మాయి నా కూతురే! కింద నీతో మాట్లాడిన ముసలాయన నా భర్త! అమ్మాయి చాలా అల్లరిదీ, తెలివయినదీను. మీలాంటి అతిథుల్ని ఏడిపించడం దానికో సరదా! మా ఇల్లు చూస్తే ఎవరయినా భయపడతారు. ఇదేదో దెయ్యాలకొంప అనుకుంటారు! పైగా రాత్రి సమయం, వర్షం దానికి బాగా కలసివచ్చాయి!'' చెప్పిందామె.


అనంత్‌కు ఇంకా అనుమానం పోలేదు? ఆమె అది గమనించి ''కిన్నెరా!'' అని మెట్లపైకి చూస్తూ పిలిచింది.

పైనుండి ''ఏం అమ్మా?'' అతడికి సుపరిచితమైన లావణ్య స్వరం వినిపించింది.

''మన అతిథిని భయపెట్టావా!!''

కిన్నెర ''సారీ చెప్పు కాస్సేపట్లో ఈ మేకప్ తీసేసి అక్కడికి వస్తాను!'' అంది! ఆమె అతడివైపు తిరిగి ''సందేహం తీరిందికదా! కాసేపు అలా కూర్చోండి. తినడానికేదయినా పట్టుకొస్తాను'' అని గజ్జెలు గలగలమంటుండగా చీకట్లోకి వెళ్లిపోయింది. అతడికి వాళ్లగురించి ఎలా అర్ధంచేసుకోవాలో తెలియక అన్యమనస్కంగా వుండిపోయేడు.

తల్లి వస్తున్న చప్పుడు వినిపించింది. ఆమె నవ్వుతూ పళ్లెంలో ఏదో తీసుకొచ్చి అక్కడ పెట్టింది. అతడు యధాలాపంగా టైం చూసుకుని అదిరిపడ్డాడు! ఆరు ఇరవై నిమిషాలయింది. తన ముందు పైగదిలో చూసుకున్నప్పుడు సరిగ్గా అంతే అయింది! సెకన్లముల్లు మామూలుగా తిరుగుతోంది. వాచీ ఆగిపోలేదనిమాత్రం



స్పష్టంగా తెలుస్తోంది.

''ముందిది తినండి'' చెప్పిందామె.

అతడికి ఆకలిగా వుంది. కానీ మొహమాటంగా వుంది. ఆమె బలవంతం చేయడంతో తినడానికి ఉపక్రమించాడు. గ్లాసులో నీళ్లు కొద్దిగా తాగాడు. పింగాణీ ప్లేటుపై వున్న మూతపై చేయివేశాడు! వేడిగా వుందది. అతడికి నోరూరింది. ఇంతలో దీపం క్రమంగా కాంతి తగ్గింది! తాగిన నీళ్లు ఉప్పగా ఉన్నట్టనిపించింది! పళ్లెం దీపం వద్దకు తీసుకెళ్లి మూత తొలగించాడు.

అంతే!! అప్రయత్నంగా కెవ్వుమని కేకపెట్టాడు!?

పళ్లెంలో పచ్చి రక్తమాంసాలున్నాయి. పెద్ద పెద్ద మాంసం ముక్కలు రక్తంలో తేలుతున్నాయి! వెంటనే తను ముందు తాగిన నీళ్ల వంచాడు... ఎర్రని ధారగా కారాయవి! నీళ్లు కాదవి! రక్తం...!!

అప్పుడు వినిపించింది ఆమె నవ్వు తెరలుతెరలుగా... మంచుదిమ్మల మధ్య కట్టివేసినట్లు వణికిపోతూ ఆమెను చూశాడు. దీపం పెద్దగా వెలిగింది. తోలు ఊడిపోయిన ముఖంతో రక్తమాంసాలు కనిపిస్తూ నోటిలో పదునైన కోరలతో ఒళ్లు గగుర్పొడిచేలా వుందామె. ఆ దృశ్యం చూసి మాట పడిపోయిందతడికి!?

హఠాత్తుగా ఆమె తల వెంట్రుకలన్నీ పైనెవరో లాగి పట్టుకున్నట్లుగా నిటారుగా పైకి లేచాయి!! ఎర్రని నాలుక క్రిందికి సాగి నేలను తాకింది. పొడవాటి గోళ్లతో ఉన్న నల్లటి ఎలుగుబంటి చేతులు రివ్వున అతడి మెడవరకూ సాగుతూ వచ్చాయి. భవంతి దద్దరిల్లేలా అరుస్తూ అతడు అక్కడినుండి గెంతాడు. అది ముందే గ్రహించినట్టు ఆమె గాలిలో తేలుతూ అతడిపైకి ఉరికింది!! త్రుటిలో తప్పించుకుని మరో మెట్ల మార్గంద్వారా క్రిందికి పరుగుతీసాడు.

● ● ●

వెర్రికేకలు పెడుతూ మతిస్థిమితం లేనివాడిలా వస్తున్న అనంత్‌ను మెట్లమధ్యలో ముసలాయన ఆపాడు... ఆయన్ని చూడగానే ధైర్యం వచ్చి గట్టిగా పట్టుకున్నాడు. ఒగరుస్తూ జరిగింది చెప్పాడు. చేతిలో లాంతరు గట్టిగా బిగించి పట్టుకుని ముసలాయన విస్మయంగా చూశాడు! ''సుభద్ర కనిపించిందా?'' నమ్మలేనట్లు అడిగాడు.

అనంత్ ప్రశ్నార్థకంగా చూసేడు? ఆయన నిట్టూర్చి ''సుభద్ర చనిపోయి దాదాపు ఎనిమిదేళ్లవుతూంది! ఈ ఇంట్లోనే చనిపోయింది జబ్బుతో. కానీ ఇంతవరకూ నాకెప్పుడూ కనిపించలేదు. నీకిప్పుడిలా కనిపించడం చాలా వింతగానూ, బాధగానూ వుంది! మా అమ్మాయిమాత్రం ఇలా కొత్తవాళ్లను భయపెట్టడం నాకు మామూలే. ఒకేలాంటి రెండు సంఘటనలు వరుసగా జరగడంవల్ల, ఈ ఇంటిపై నీకేదో అనుమానం తగలడం సహజమే! అదిగో మా ఆవిడ చిత్రపటం...!'' అంటూ దగ్గుతూ లాంతరు పైకెత్తి గోడపైకి చూపించాడు.

అనంత్ అద్భుతం చూస్తున్నట్టు చూసేడు! అక్కడ నిజంగానే పెద్దచిత్రపటం వుంది. పటంలో సుభద్ర అచ్చు ఇంత క్రితం కనిపించినవిధంగానే పట్టుచీరె, వంటినిండా నగలతో వుంది. ఆమె సూటిగా తనవైపే చూస్తున్నట్టుండడంతో ఉలిక్కిపడ్డాడు!

ఇంతలో మెట్లకిందనుండి ''నాన్నా'' అని

వినిపించింది!!

కింద కిన్నెర దీపం వెలుతురులో నవ్వుతూ కనిపించింది. ఆమె అందం కాంతిలో మెరిసిపోతూంది. ఏమీ అర్థంకావడంలేదతడికి! చలిగాలి ఒక చెవిలోంచి మరో చెవిలోకి దూసుకుపోతున్నట్లుంది.

ఊహించనివిధంగా ముసలాయన చేతిలో లాంతరు క్రిందికి జారిపోయింది!

అది నేరుగా పోయి కిన్నెర ముఖంపై పడింది! భగ్గున మంట లేచింది ముఖంపై!? అది చూసి ముసలాయన ''అమ్మా జాగ్రత్త'' అన్నాడు.

అనంత్ వణికిపోతూ చూశాడా దృశ్యాన్ని!!

కిరసనాయిలు వలికి ఆమె తలంతా మంటలు లేచాయి... కిన్నెర ఏమీ మాట్లాడ్డం లేదు. ముసలాయన పైనుండే అనునయిస్తున్నాడు.

క్రిందికి దిగకుండా!

వాళ్ల చర్యలకతడికి మతిపోతూంది. అప్పుడు వచ్చింది అనుమానం!? ముసలాయన్ని పరీక్షగా చూశాడు. అతడి పాదాలు రెండూ వెనక్కి తిరిగున్నాయి. పైగా, నేలకు నాలుగంగుళాలు పైన గాలిలో తేలుతూ వున్నాయి!!

రాబోతున్న కేకను బలవంతంగా ఆపుకున్నాడు. వాళ్ల సంగతి పూర్తిగా అర్థమైంది. ఇంతలో కిన్నెర కిలకిలా నవ్వుతూ నిల్చున్నపళంగా నిటారుగా గాలిలోకి లేచింది! వాళ్లు నిల్చున్నచోట, మెట్లకు సమాంతరంగా ఉన్న చెక్కదూలంపై వాలి, సర్కస్ చేస్తున్నట్లు నడుస్తూ వాళ్లవేపు రాసాగింది. అనంత్ వణికిపోతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకుని ఒక్క ఉదుటున క్రిందకి పరుగందుకున్నాడు.

''పారిపోతున్నాడు పట్టుకోండి!'' ముసలాడి కంఠం అత్యంత కర్కశంగా వినిపించింది. వెనక!

చీకట్లో మూడు ఆకారాలు రివ్వున వచ్చి అతడిమీద పడ్డాయి! ఎలాగైనా ప్రాణాలు దక్కించుకోవాలన్న దృఢసంకల్పంతో వాళ్లను ఛేదించుకుంటూ మొండి ధైర్యంతో పరుగులు పెట్టాడు???!

చెమటలు కారిపోతున్నాయి. అతడికి

## ఏముందని?



''నీ దగ్గర ఏముందని నిన్ను ప్రేమించాలి రమణా'' అడిగింది కామిని.

''మా నాన్న పెద్ద కోటీశ్వరుడు తెలుసా?'' గొప్పగా చెప్పాడు రమణ.

''అలాగా.. అయితే ఆయన్నే ప్రేమిస్తా. నిన్నెందుకు.'' అని వెళ్లిపోయింది కామిని.

-భూక్యా గోపీనాయక్ (చిలకలూరిపేట)

వళ్లంతా... దుస్తులు చిరిగి పీలికలయ్యాయి పోట్లాటలో!! శరీరంనిండా దుమ్మూ, ధూళీ అంటుకుపోయింది!!

చివరికెలా అయితేనేం - దెయ్యాల భవంతినుండి ప్రాణాలతో బయటపడ్డాడు.

● ● ●

గట్టిగా ఉలిక్కిపడి అనంత్ నిద్రలేచాడు!

చెమటతో శరీరమంతా తడిసి ముద్దయింది. చీకటి బాగా పడింది. టైము చూస్తే ఆరూ పదిహేను నిమిషాలయింది. కల గుర్తుకురావడంతో మత్తు వదిలిపోయిందతడికి!!

అప్పుడు గమనించాడు తాను సమాధిపై గాకుండా నేలపై వుండడాన్ని! నిద్రలో క్రిందకు దొర్లిపోయిందికూడా అతడికి తెలియలేదు. చటుక్కున వణికే గుండెతో భవంతివైపు తలతిప్పాడు. దూరంలో మసకమసకగా కన్పిస్తున్న పాడుబడిన భవంతి నిశ్శబ్దంగా అతడినే చూస్తున్నట్లుంది. చీకట్లో ఆ పరిసరాలు ఇప్పుడతడిని నిజంగా భయపెడుతున్నాయి. వెంటనే లేచి పోయి పరుగందుకున్నాడు అక్కడినుండి! ఇక! ఒక్క క్షణం కూడా అక్కడ ఉండకూడదనుకున్నాడు!

ఇంతలో పెద్దగా రైలుకూత వినిపించింది! ప్రయాణం సంగతి గుర్తొచ్చి అడ్డొస్తున్న ముళ్లకంపల్ని, చెట్టుకొమ్మల్ని లెక్కచేయకుండా పరుగు వేగం పెంచాడు.

ఒగరుస్తూ రైలెక్కాడు. రైలు అనుకొన్న టైముకంటే ముందే కదిలింది.

బల్బు వెలుతురులో అద్దంలో తన ప్రతిబింబం చూసుకొని అప్రయత్నంగా కెవ్వుమన్నాడు. రేగిన తల, చిరిగిపోయిన దుస్తులు, వంటినిండా మట్టితో ఎవరితోనో పోట్లాడి వచ్చినట్టున్నాడతడు!??

కానీ - అతడు నిదానంగా ఆలోచిస్తే, నిద్రలో కిందికి దొర్లి పడిపోవడంవల్ల శరీరమంతా మట్టి అంటుకోవడం, రైలు ఎక్కడానికి పరుగెత్తినప్పుడు ముళ్లకంపలు తగులుకొని దుస్తులు చినిగిపోవడం గుర్తొచ్చి ఉండును.

★



డిజైన్: దాసరి కేశవరావు (గంగురేగు వలస)